తేదీ 9.10.2008, విజయదశమి, సాయికుల్వంత్ సభామండపం

# ఆ మహా విష్ణువే ఈ మహీ విష్ణువు

**కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననె వృద్ధి పొంది కర్మముననె చనున్**
**కర్మమె నరునకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో!**

**లో**కములో అనేకమంది కష్టసుఖములు అనుభవిస్తున్నారు. కష్టము కలిగినప్పుడు వారి కర్మ అనుకుంటున్నారు. సుఖము కలిగినప్పుడు వారి ప్రాప్తి అని ఆనందిస్తున్నారు. కాని, ఈ కష్టసుఖములు రెండింటికీ కర్మయే కారణం. "యద్భావం తద్భవతి". ఎట్టి తిండి తింటామో అట్టి త్రేపే వస్తుంటాది. అదేవిధముగనే, ఎట్టి కర్మలు చేస్తామో అట్టి ఫలితమునే అనుభవిస్తుంటాము. ఈ లోకమంతయును కర్మచేతనే జరుగుతున్నది. కనుక, మనము ఆచరించే కర్మ పవిత్రమైనటువంటిదిగా ఉండాలి.

ఇప్పుడు దసరా ఉత్సవం జరుపుకుంటున్నాము. దీని అంతరార్థమేమిటి? దశేంద్రియములతో మనం ఆచరించే కర్మలను పవిత్రం గావించుకొనుటకే ఈ దసరా ఉత్సవం జరుపుకుంటున్నాము. ఈ లోకములో ప్రతి మానవుడు కర్మలు ఆచరించాలి. దీనికి మొట్టమొదట దేవీ అనుగ్రహం పొందాలి. ఆమె శక్తి స్వరూపిణి; తన శక్తిచేత లోకంలో సర్వకర్మలనూ జరుపుతుంటాది. కనుకనే, నవరాత్రులు వచ్చాయంటే మనం దేవీ పూజ చేస్తుంటాము. ఆ దేవీ పూజవల్ల మనలో 'ఎనర్జీ' (శక్తి) ప్రవేశిస్తుంది. తద్వారా లక్ష్మి మనకు ధన, ధాన్యములను, వస్తువాహనాదులను అనుగ్రహిస్తుంది; ఇంక సరస్వతి విద్యాబుద్ధులను ప్రసాదిస్తుంది. శక్తి ఉంటేనే కదా ధనధాన్యములు, వస్తువాహనములు, విద్యా బుద్ధులు మనకు లభ్యమవుతున్నాయి. కనుకనే, దుర్గ, లక్ష్మి, సరస్వతి – ఈ ముగ్గురినీ ఆరాధించడం అత్యవసరమని ఈ నవరాత్రులు మనకు బోధిస్తూ వచ్చాయి. ఈ

sri sathyasai vachanamrutam

నవరాత్రులలో మన దశేంద్రియములను ధర్మమార్గంలో ప్రవేశపెట్టినప్పుడు నవవిధములైన శక్తులను పొందుతున్నాము. నవరాత్రుల యొక్క అంతరార్థమిదే! ఏ పని చేస్తే ఏది మనకు లభ్యమవుతుంది? ఏ క్రియవల్ల ఏది మనకు ప్రాప్తిస్తుంది? అనే విచారణా శక్తి అత్యవసరము. ఇట్టి విచారణాశక్తి గల బుద్ధి మానవునికి చాలా ప్రధానమైనటువంటిది. వైరునందు ప్రసరించే కరెంటువలె బుద్ధి అనేది మనిషియొక్క సర్వగుణములందు ప్రవేశిస్తుంది. కనుక, ప్రతి మానవుడుకూడను ధర్మాన్ని ఆచరించాలి. కర్మను ఆచరించక ఫలితమును పొందలేము. అయితే, మంచి చేసినా, చెడు చేసినా రెండింటియొక్క ఫలితమును మనము అనుభవించవలసిందే! పంచపాండవులుకూడను తమ కర్మఫలితమును అనుభవించారు. సీత కూడను కర్మఫలితమును అనుభవించక తప్పలేదు. కనుక, మనము పవిత్రమైన, పరోపకార సంబంధమైన కర్మలను ఆచరించినప్పుడు సర్వశక్తులను పొందగలము; లక్ష్మీ అనుగ్రహాన్ని అందుకోగలము.

**సత్యధర్మముల ఏకత్వమే సత్యనారాయణుడు**

నారాయణుడు శాశ్వతమైనటువంటివాడు కనుక, తానుకూడా శాశ్వతంగా ఉండాలని లక్ష్మి నారాయణుని వక్షస్థలములో చేరి సర్వులకు తన అనుగ్రహాన్ని అందిస్తూ వస్తున్నది. విష్ణువే నారాయణ స్వరూపాన్ని ధరించాడు. నారాయణు దనగా లక్ష్మీ నారాయణుడు కాదు, సత్యనారాయణుడు. ఈ సత్యనారాయణుడు సామాన్య ప్రజల్లో తిరుగాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ అందరితో మాటలాడుతూ సంతోషంగా సంచారం చేస్తుంటాడు. చూచుటకు ఇతను సామాన్య మానవుడే! ఏమీ తెలియనటువంటివానిగా ఉంటాడు. కాని, ఇతని శక్తులు అసమానమైనటువంటివి; ఇట్టివి, అట్టివి అని వర్ణించదానికి వీలుకానివి. ఈ సత్యనారాయణునకు సత్యమే ప్రధానము. ఎక్కడికి వెళ్లినా సత్యప్రబోధలు సల్పుతుంటాడు. సత్యమనేటటువంటిది సామాన్యమైనది కాదు.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**

srisathyasai vachanamrutam

**సత్యంబు నందణగె సర్వసృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న?**
**శుద్ధ సత్వమిదియె చూడరయ్య!**

సత్యముచేతనే ధర్మము ఆవిర్భవిస్తుంది. "సత్యాన్నాస్తి పరో ధర్మః" కనుక, సత్యధర్మముల ఏకత్వమే సత్య నారాయణుడు. ఈ రెండింటినీ ప్రబోధించే నిమిత్తమై తాను అవతరించాడు.

సత్యనారాయణరాజు సామాన్యుడు కాడు. కాని, మానవుడు ఇతనిని సామాన్యుడుగా భావిస్తున్నాడు. సత్యనారాయణుడు ఏది చెప్పినా సత్యమే, సత్యమే, సత్యమే! సత్యమనగా తన హృదయంలో ఉన్నటువంటిది తెలపడం; తెలపడం మాత్రమే కాకుండా దానిని చేసి చూపడం. కాని, స్వామి చెప్పే మాటలను మానవులు సరిగా గమనించడం లేదు. ఒక్కొక్కసారి 'స్వామి ఏదో తమాషాకు చెబుతున్నాడులే' అని అనుకుంటున్నారు. కాదు, కాదు; తమాషాగా చెప్పినా, నవ్వుతూ చెప్పినా ఏవిధంగా చెప్పినా అది సత్యమే, సత్యమే, సత్యమే! కాని, స్వామికి దగ్గరున్నటువంటి వారుకూడను ఈ సత్యాన్ని సరిగా గుర్తించక చెప్పిన మాటలను అలక్ష్యంగా వదలిపెట్టేస్తుంటారు. కాని, ముస్ముందు దీని ఫలితం తప్పక తెలుస్తుంది. భవిష్యత్తును గుర్తించుకోలేనటువంటి మానవులే స్వామి మాటలను అసత్యంగాను, తమాషాగాను భావిస్తూ వస్తుంటారు. కాని, భవిష్యత్తులో వీటియొక్క సత్యము ప్రత్యక్షంగా గోచరమవుతుంది. కనులముందు కనిపిస్తూ, మాట్లాడుతూ, కనులముందే అన్నీ జరుపుతూ ఉండినప్పటికీ స్వామి మాటలనుగాని, స్వామి విషయమునుగాని మానవులెవ్వరూ సరిగా గుర్తించడం లేదు. ఇదేదో జోక్ చెప్పాడని దానిని అలక్ష్యంగా వదలిపెడుతున్నారు. ఈ దేహము పుట్టి 83 ఏళ్ళు కావస్తున్నది. ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడను నేను మరువలేదు. కాని, ఒక్కొక్కతూరి మరచినట్లుగా మీకు కనిపిస్తుంది. "స్వామి మరచిపోయినాడే" అంటారు. కాని, మరుపు అనేది ఎప్పుడూ నాలో రాదు. **"ఎఱుక మరుపనకుండ నిరతము జాగ్రత్స్వప్న సుషుప్తిలో అరమరలు లేకుండ ఎప్పుడు తరచుగ జీవాత్మ చదివెడి తారకమే (సోఽహం) సత్యసాయి తత్త్వము."** ఎఱుక, మరుపులకు అతీతమైనటువంటి ఇట్టి సత్యమును తప్పుగా భావించడం మానవుని బలహీనత.

srisathyasaivachanamrutam

ఇంతవరకు నేను తెలుపలేదు కాని, ఈనాడు సమయం దగ్గరికి వచ్చింది కనుక ఈ సత్యాన్ని ప్రజలకు తెలుపవలసివచ్చింది. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలి.

**నాకు అందరూ సమానులే!**

సత్యమునకు ఎట్టి భేదములూ లేవు. ద్వేషముగాని, అయిష్టముగాని, క్రోధముగాని, శతృత్వముగాని సత్యమునకు లేవు. అందరూ సత్యం బిడ్డలే! కనుక, నాకు అందరూ సమానులే! నేను భేదము చూపినట్లుగా మీరు భావిస్తుంటారు. కాని, నాకెప్పుడూ భేదము లేదు. మీకు తెలుసు – ఎవరేమన్నప్పటికీ, నాకు విరుద్ధంగా వారు మాట్లాడినప్పటికీ నేను నవ్వుతూనే ఉంటాను. నేనెప్పుడుకూడను ఎవ్వరినీ కోపించలేదు. నాలో కోపమనేది లేదు. "స్వామిని ఇన్నివిధములుగా మేము విసిగిస్తుంటే, విమర్శిస్తుంటే, ఇంత కష్టపెడుతుంటే స్వామి నవ్వుతూనే ఉంటాడు. ఈ ఓపిక స్వామికి ఎక్కడినుండి వచ్చింది!" అని ఆశ్చర్య పడుతుంటారు. అందరూ ఒక్క ఇంటివారే! వ్యక్తులు వేరువేరుగా కనిపించినప్పటికీ అందరియందు ఉన్నటువంటి ఆత్మశక్తి ఒక్కటే. అందరియందు ఒక్కడే ఉన్నాడు; ఆ ఒక్కడు ఎవరంటే ఆత్మానారాయణుడే! ఇట్టి ఆత్మతత్త్వాన్ని గుర్తించుకోవడానికి ప్రతి మానవుడు ప్రయత్నించాలి. ఇక్కడెన్నో బల్బులు వెలుగుతున్నాయి. ఒక్క మెయిన్ స్విచ్‌ని ఆఫ్‌చేస్తే ఇవన్నీ ఆరిపోతాయి. బల్బులు చూస్తే విడివిడిగా కనిపిస్తున్నాయికాని, వాటిలో ప్రసరించే కరెంటు ఒక్కటే. అదేవిధముగనే, సృష్టిలో అనేక రూపనామములు కనిపించినప్పటికీ అందరిలో ఉన్నటువంటి ఆత్మ ఒక్కటే. భగవంతుడు ఆత్మతత్త్వంతో సర్వమును వెలిగింపజేస్తున్నాడు. బల్బులలో కొన్ని 'డిమ్'గానూ, కొన్ని 'బ్రైట్'గానూ కనిపిస్తుంటాయి. అది బల్బులయొక్క 'వోల్టేజి'లో ఉన్నటువంటి వ్యత్యాసమే తప్ప కరెంటుయొక్క దోషం కాదు. అదేరీతిగా, మానవులు అనుభవించే కష్టనష్టములకు కారణం వారి హృదయంలోని భావములే తప్ప భగవంతుని దోషము ఏమాత్రమూ కాదు.

**విష్ణువే సత్యనారాయణుడుగా జన్మించాడు**

భగవంతుడు భక్తులయొక్క ఆనందము నిమిత్తమై అనేకరకములైనటువంటి చర్యలు చేస్తుంటాడు. అయితే, భగవంతునికి ఏ ఇష్టమూ లేదు, ఏ కోరికా లేదు! "సమస్త లోకాస్సుఖినో భవంతు" అన్నదే భగవంతునికి గల ఒకే ఒక్క కోరిక. కాని, ఎవరు



srisathyasaivachanamrutam

చేసుకున్నటువంటి కర్మలను వారు అనుభవిస్తూనే ఉంటారు. అందరూ సుఖంగా ఉండాలంటే ఎప్పటికీ వీలుకాదు. ఒకరికి దుఃఖము, ఒకరికి సుఖము, ఒకరికి ఆదాయము, ఒకరికి నష్టము – ఈవిధంగా జరుగుతూనే ఉంటాయి. నాకు ఏ ఒక్క కోరికకూడను లేదు. నేను ఏది చేసినా అది మీ ఆనందంకోసమే! కనుకనే, ఈ సత్యనారాయణుని "విష్ణుః" అని పిలిచారు. ఇది విష్ణు పురాణమునందు పూర్తిగా వివరించి చెప్పారు. ఈ జగత్తులో విష్ణువే సత్య నారాయణుడుగా జన్మించాడు. సత్యనారాయణుడే విష్ణువు. ఇతను సామాన్యమైన నారాయణుడు కాదు, సత్యనారాయణుడు! ఈ సత్యనారాయణుని తత్త్వాన్ని మీరు చక్కగా అర్థం చేసుకోవాలి.

ఈ పది దినములూ నేను మాట్లాడకుండా ఉండటానికి కారణమేమిటని అందరూ అనేకరకాలుగా ఊహిస్తూ వచ్చారు. కాని, ఒక్క సత్యము మీకు చెప్పాలి. అది చెప్పే నిమిత్తమై ఈనాడు నేను మైకు ముందు కూర్చున్నాను. నన్ను ప్రేమించేవారిని నేను ప్రేమిస్తున్నాను; ద్వేషించేవారినికూడా ప్రేమిస్తున్నాను. నేను ప్రేమించనటువంటివారు ఈ జగత్తులో ఒక్కరూ లేరు. కాని, దీనిని ఎవ్వరూ అర్థం చేసుకోవడం లేదు. "స్వామి మాతో మాట్లాడటం లేదే, మాపైన కోప మేమో!' అని భావిస్తుంటారు. నాకు 'ఏంగర్' (కోపం) అనేది లేనే లేదు. భక్తులంటే 'హంగర్' (ఆకలి) మాత్రమున్నది. ఆ 'హంగర్'చేతనే అందరినీ నా చెంతకు చేరుస్తున్నాను. భగవంతుడు ప్రేమస్వరూపుడేగాని, ద్వేషస్వరూపుడు కాడు. అట్టి సత్యాన్ని ప్రబోధించే నిమిత్తమై నవరాత్రులు ప్రారంభమైనాయి. అనేకమంది అనేకరకాలుగా నన్ను పూజిస్తుంటారు, వర్ణిస్తుంటారు. వారివారి ఇష్టముకొద్దీ వారు చేస్తుంటారు. వారి హృదయము అలాంటిదిగా ఉంటుంది. కాని, నాకు అవి ఇష్టం లేదు. నాయందు ఎట్టి భేదములూ లేవు. అందరుకూడను ప్రేమస్వరూపులై, 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్'గా ఉండాలన్నదే నా కోరిక.

**సత్యాన్ని గుర్తించి వర్తించేవారు చాలా తక్కువ**

మానవుడనగా చాలా విలువైనవాడు. Men are more valuable than all the wealth of the world. అందరూ భగవంతునియొక్క బిడ్డలే! కనుక, అందరినీ ప్రేమతో

sri sathyasaivachanamrutam

చూసుకోవాలి. ఒకరు మనను ప్రేమించకపోయినప్పటికీ వారిని మనం ప్రేమించి దగ్గరకు తీసుకోవాలి. మననుండి ప్రేమ అందుకోనంతవరకు వారు మనకు దూరంగానే ఉంటారు. మన ప్రేమ ఒకతూరి కరెంటువలె వారిలోకి ప్రసరించిందంటే, అది తక్షణమే వారిలో సత్పరిణామం తెస్తుంది. అట్టి సత్పరిణామం వచ్చేంతవరకు నేను కాచుకొని ఉంటాను. ఇన్ని వేలమంది నా ఉపన్యాసములు ఎన్నో విన్నారు; ఎన్ని రకములైనటువంటి శక్తులో నాదగ్గర చూశారు. కాని, ఎన్ని శక్తులు చూసినా, ఎన్ని ఉపన్యాసాలు విన్నా వారివారి ఉద్దేశ్యముల ప్రకారం వారు చెపుతూ వస్తున్నారేగాని, సత్యాన్ని గుర్తించి వర్తించేటటువంటివారు చాలా తక్కువ. నిజంగా సత్యమార్గమును తెలుసుకున్నటు వంటివారు దానిని తప్పక ఫాలో చేస్తూ వస్తారు. కొందరు తమకు కోపము వచ్చినప్పుడు, భేదము వచ్చినప్పుడు సత్యమార్గమునకు దూరమవుతుంటారు. వారికి భేదము వచ్చినా వారిపట్ల మన ప్రేమ మాత్రం ఒక్కటిగానే ఉండాలి. వారెవరైతే మనకేమి! వారెవరో అనే భేదభావముతో మనం వారిని దూరం చేసుకోవడం చాలా తప్పు. ఎందుకనగా వారు పరాయివారు కాదు. ఈనాడు వారు నీకు పరాయివారుగా కనిపించవచ్చును. కాని, రేపటి దినము వారు కూడను నీ బ్రదర్సే! అందరూ బ్రదర్స్ అండ్ సిస్టర్సే! కనుక, మనము అందరినీ ప్రేమించి, అందరితోనూ సమత్వంగా జీవించాలి. All are one, be alike to everyone. ఇదే ఈనాడు నేను మీకందించే ప్రత్యేకమైనటువంటి సందేశము. ఈనాడు ఈ సత్యాన్ని మీరు తెలుసుకోలేకపోయినప్పటికీ ఏనాటికైనా గుర్తిస్తారు.

చెట్టుకు కాసిన కాయలన్నీ ఒకేతూరి పండవు; ఒక్కొక్కటి ఒక్కొక్క సమయంలో పండుతూ ఉంటుంది. చెట్టుకు పూసిన మొగ్గలన్నీ ఒకేరోజు విచ్చుకోవు; ఒక్కొక్క రోజు కొన్నికొన్ని విచ్చుకుంటూ ఉంటాయి. అదేవిధముగనే, ఈ జగత్తులో పుట్టిన మానవులలో కొంతమంది పుష్పాలవలె విచ్చుకొని ఉంటారు, కొంతమంది ఇంకా మొగ్గలుగానే ఉంటారు. ఆ మొగ్గలు నేడు కాకపోతే రేపటికైనా విచ్చుకొని పవిత్రమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. ఆ సుగంధము వచ్చేంతవరకు మనము కాచుకోవాలి. ఇది నాయొక్క ప్రధానమైనటువంటి సందేశము.



srisathyasaivachanamrutam

ఈనాడు వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞమునకు పూర్ణాహుతి జరిగింది. పూర్ణాహుతి అనగా ఏమి? సంపూర్ణమైన త్యాగమే! అయితే, నాది ఎప్పటికీ పరిపూర్ణమైన త్యాగమే! "ఇప్పుడు చేశాను, రేపటికి లేదు" అనేది లేదు. అర్థం చేసుకోగలవారికి ఇది తప్పక తెలుస్తుంది.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

పిల్లల్లారా! మీరు ఇంకా చిన్నచిన్న మొగ్గలుగా ఉన్నారు. కనుక, మీకిప్పుడు అంతగా అర్థం కాదు. కొంత పెరుగుతూ వచ్చేసరికి క్రమక్రమేణ స్వామియొక్క మాటలు మీకు అర్థమవుతాయి. అంతవరకు మీరు శాంతంగా, మౌనంగా బ్రతకండి.

**సెల్‌ఫోన్లను ఎక్కువగా ఉపయోగించకండి!**

ఇంకొక విషయమేమిటంటే, ఈనాడు ప్రతి పిల్లవాడుకూడను ఒక చిన్నఫోను పెట్టుకొని ఉంటాడు. "ఇదేదో నా అనుకూలముకోసం పెట్టుకున్నాను" అని అనుకుంటాడుకాని, అది ఎన్నిరకాలుగానో 'మిస్ యూస్' (దుర్వినియోగం) అవుతున్నది. ఇంతేకాకుండా, వీటివలన ఆడవారికి, మగవారికికూడను కొన్నిరకములైన దుర్భావములు బయల్దేరుతున్నాయి. చెడు ఆలోచనలు మాత్రమే కాదు, చెడు కనెక్షన్లు కూడా ఏర్పడుతున్నాయి. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్నట్లు బంధనకుగాని, మోక్షమునకుగాని మన మనస్సే కారణం. కాబట్టి, మన మనస్సులో చెడు ఆలోచనలు రాకుండా ఉండడానికి మనము అనవసరంగా ఎవరితోనూ 'కనెక్షన్' పెట్టుకోకుండా ఉండాలి. కాని, మనము బయటివాళ్ళకుకూడను మన నెంబరు ఇస్తుంటాము. దానివల్ల ఏమి జరుగుతుంది? అనేకరకములైన 'కనెక్షన్లు' ఏర్పడతాయి. "ఈ నంబరుకు చేస్తే ఆ అబ్బాయి పలుకుతాడా లేదా" అని అబ్బాయిలకొరకు అమ్మాయిలు కాచుకొని ఉంటారు. అట్లే, అమ్మాయిల కొరకు అబ్బాయిలు కాచుకొని ఉంటారు. కనుక, మీరు ఈ ఫోన్లు ఎక్కువగా ఉపయోగించకండి. ఇప్పుడేమో మంచిగా అనిపించ వచ్చును. కాని, క్రమక్రమేణ దానివల్ల ఎన్నో ఇబ్బందులు కలుగుతాయి. నాకు 83 సంవత్సరాలయినాయి. ఈనాటివరకు నేను ఫోన్లు పెట్టుకోలేదు.



sri sathyasaivachanamrutam

ఎంతెంతమందో ఏడ్చుకుంటూ నాకు ఫోను చేయాలని ప్రయత్నిస్తారు. కాని, నేను ఫోనులో మాట్లాడను. అందువల్లనే ఈవిధంగా మీకు చెప్పడానికి నాకు అధికారముంది.

మీరు పిల్లలు కనుక, మీ వయస్సుకు తగినట్లు నడుచుకోవాలి; చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు అలక్ష్యంగా ఉంటే ఈ జగత్తు మిమ్మల్ని అలక్ష్యంగా చూస్తుంది. మీరు జాగ్రత్తగా ఉంటే, అందరూ మీపట్ల జాగ్రత్తగా ఉంటారు. గౌరవముగాని, అగౌరవముగాని మీ ప్రవర్తనతోనే వస్తుంటాయి. 'నేను మంచిగానే మాట్లాడుతున్నాను' అని మీరనుకుంటారు. కాని, మీ మంచి అనేది ఎదుటివారికి అర్థమవుతుందో లేదో! మీరు ఏమాత్రం అపార్థానికి గురికాకుండా జాగ్రత్త పడాలి. పెద్దవారయితే ఫరవాలేదు, కొంతవరకు అర్థం చేసుకుంటారు. కాని, ఈ వయస్సు పిల్లలు ప్రతిదానిని 'మిసండర్‌స్టాండ్' (అపార్థం) చేసుకుంటారు. ఆ 'మిసండర్‌స్టాండింగ్' వచ్చిందంటే అన్నింటినీ 'మిస్' అయిపోతారు. కనుక, మీరు జాగ్రత్తగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. వీలయితే ఆ ఫోన్లను బావిలో పడేయటం మంచిది. అది మీకు హాయి. లేకపోతే, అసలు వాటిని కొనుక్కోకుండా ఉండటం మంచిది. కొనుక్కుంటే, ఎవరితో ఎంతవరకు అవసరమో అంతమాత్రమే 'కనెక్షన్' పెట్టుకోవాలి; ఇంక ఇతరులతో ఏమాత్రమూ ఎలాంటి పరిస్థితియందైనను 'కనెక్షన్' పెట్టుకోకూడదు. అనవసరంగా వాళ్ళదీ, వీళ్ళదీ వింటూ దానిని ఇంకొకరికి చెబుతూపోతుంటే మీరు ఇతరుల మనసులను పాడు చేసినవారవుతారు. వీళ్ళది వాళ్ళకు, వాళ్ళది వీళ్ళకు చెప్పి మనసులు పాడుచేయడమెందుకు! ఒకవేళ మాట్లాడకపోతే 'వీళ్ళు మాతో మాట్లాడలేదే' అని అనుకుంటారు. ఎందుకీ నిష్ఠూరాలు? ఆ ఫోన్లు మీవద్ద ఉండటంవల్లనే కదా ఇవన్నీ! కనుక, జాగ్రత్తగా ఉండి మంచిపేరు తెచ్చుకోండి!

**(తేదీ 9.10.2008, విజయదశమి, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam